మోదీ పర్యటనను విజయవంతం చేయాలి

విశాలాంధ్ర - పెందుర్తి: ప్రధాని నరేంద్ర మోడీ విశాఖపట్నం పర్యటనను విజయవంతం చేయాలని పెందుర్తి ఎమ్మెల్యే పంచకర్ల రమేష్ బాబు, ఎన్డీఏ నాయకులు అధికారులకు సూచించారు. ఈనెల 8న నరేంద్ర మోడీ పర్యటన సందర్భంగా సుజాతనగర్ దాట్ల మెన్షన్స్ కళ్యాణ మండపంలో సోమవారం ఆయన, ఎన్డీఏ నాయకులు అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బిజెపి నియోజకవర్గ ఇన్‌చార్జి గొర్లె రామునాయుడు, టీడీపీ, జనసేన నాయకులు నియోజక వర్గంకు సంబంధించిన మూడు మండలాల ఎంపీడీవోలు, మండల స్థాయి అధికారులు జీవీఎంసీ జోనల్ కమిషనర్, అధికారులు, ఎన్‌డీఏ మహాకూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. నాయకులు, అధికారులు సమన్వయంతో పనిచేసి పెందుర్తి నియోజకవర్గం నుండి 25 వేల మంది ప్రజలను మోదీ రోడ్ షోకు తరలించాలని విజ్ఞప్తి చేశారు.

స్టీల్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా చలో కలెక్టరేట్

విశాలాంధ్ర - గాజువాక: కేంద్ర ప్రభుత్వం విశాఖ ఉక్కు కర్మాగారాన్ని ప్రైవేటీకరణ చేసే ప్రయత్నాలను తక్షణమే విరమించుకోవాలని ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. సోమవారం చలో కలెక్టరేట్ కార్యక్రమాన్ని ఉక్కు పరిరక్షణ పోరాట నిర్వహించింది.

సోమవారం ఉదయం 9 గంటలకు కూర్మన్నపాలెం కూడలి నుంచి వేలాది మంది ఉక్కు ఉద్యోగులు, కాంట్రాక్ట్ కార్మికులు, ఉక్కు నిర్వాసితులు బైక్ ర్యాలీ నిర్వహించి కలెక్టరేట్‌కు చేరుకున్నారు. ఈనెల 8న భారత ప్రధాని విశాఖ పర్యటన నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వాన్ని నిరసిస్తూ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ ఈ బైక్ ర్యాలీని నిర్వహించింది. ఈ ర్యాలీలో ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ చైర్మన్‌లు డి.ఆదినారాయణ, మంత్రి రాజశేఖర్, కన్వీనర్‌లు కె.ఎస్.ఎన్.రావు, జె.అయోధ్య రామ్, నాయకులు వరసాల శ్రీనివాసరావు, డివిఆర్ రెడ్డి, దాసరి సురేష్ బాబుతో పలువురు నాయకులు నేతృత్వం వహించారు. బైక్ ర్యాలీ అనంతరం పోరాట కమిటీ నేతలు మాట్లాడుతూ 8న విశాఖ పర్యటనకు వస్తున్న ప్రధాని నరేంద్ర మోడీ విశాఖ ఉక్కు కర్మాగారాన్ని ప్రైవేటీకరణ చేయబోమని ప్రకటన చేయాలని అన్నారు. తక్షణమే ఉక్కు కర్మాగారంపై స్పష్టమైన ప్రకటన రావాలని, లేని పక్షంలో ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

అప్పన్న హుండీ ఆదాయం రూ.1.94 కోట్లు

విశాలాంధ్ర - సింహాచలం: ఉత్తరాంధ్ర ఆరాధ్య దైవం శ్రీ వరాహ లక్ష్మీ నృసింహ స్వామి వారి హుండీ ఆదాయం రూ.కోటి 94,40,202/-లు లభించింది. భక్తులు స్వామివారికి ముడుపులు, మొక్కు బడులుగా బంగారం 000.046.100, గ్రాములు వెండి 009.530.000 గ్రాములు లభించింది. అదే విధంగా విదేశీ భక్తులు యు.ఎస్.ఏ 327 డాలర్లు, సింగపూర్ 815 డాలర్లు, కెనడా 20 డాలర్లు, ఇంగ్లండ్ 10 పౌండ్లు, మాల్దీవ్స్ 10 రిఫయ్యా, నేపాల్ 130 రూపాయిలు, మలేషియా 63 రింగెట్స్, యు.ఏ.ఇ 10 దిరమ్స్, ఖతర్ 8 రియల్, సౌదీ అరేబియా 30 రియల్స్, ఒమన్ 200 రింగెట్స్, 10 యూరోలు హుండీలో సమర్పించినట్లు ఈఓ వి.త్రినాధరావు తెలిపారు. హుండీ లెక్కింపులో దేవస్థానం అధికారులు, సిబ్బంది, శ్రీవారి, శ్రీహరి స్వచ్ఛంద సంస్థలు పాల్గొన్నాయి. గాజువాక, శ్రీహరిపురం కాపరస్తులు వెంక్కన్న బాబు దంపతులు స్వామివారి నిత్యాన్నదాన ప్రసాద పథకానికి లక్ష రూపాయల విరాళాన్ని ఆలయ అధికారులకు అందజేసారు.

దొడ్డి కొమరయ్య చిత్ర యూనిట్ ఆత్మీయ సమావేశం

విశాలాంధ్ర - పెదగంట్యాడ: తెలంగాణ సాయుధ పోరాట తొలి అమరుడు దొడ్డి కొమరయ్య చిత్ర యూనిట్ ఆత్మీయ సమావేశం ఉక్కు నగరంలో జరిగింది. ఉక్కు తెలంగాణ ఉద్యోగుల సంక్షేమ సంఘం ఆహ్వానం మేరకు దొడ్డి కొమరయ్య చిత్ర యూనిట్ ఉక్కు నగరంలో సమావేశం నిర్వహించింది. చిత్ర యూనిట్ డైరెక్టర్ ఎం.సేనాపతి దొడ్డి కొమరయ్య చిత్ర విశేషాలను తెలిపారు. తెలంగాణ ఉద్యోగుల సంక్షేమ సంఘం ప్రధాన కార్యదర్శి జి.ఆనంద్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి ఉక్కు జనరల్ మేనేజర్ ఎన్.వీరేశం ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ ప్రజలకు మంచి సందేశాన్ని ఇచ్చే సినిమాలు రావాలని అన్నారు. ఈ సమావేశంలో సంఘం అధ్యక్షులు ఎన్.కుమారస్వామి, అడ్వైజర్‌లు కె.వేణు గోపాల్, ఎస్.బల రాం, జె.శ్రవణ్ కుమార్, వర్కింగ్ ప్రెసిడెంట్ బి.వెంకటేశ్వర్లు, ప్రతినిధులు టి.ప్రభాకర్, సి.హెచ్.రవికుమార్, ఎస్.నర్సింగరావు, వి.సహదేవ్, ఆర్.నరసింహ, దొడ్డి కొమరయ్య, చిత్ర డైరెక్టర్ ఎం.సేనాపతి, టీం సభ్యులు అబ్దుల్ రహిమాన్, తక్కెళ్ళ పల్లి విజయ కుమార్, రావుల శ్రీనివాస్, ఎం.నాగ సూర్య తదితరులు పాల్గొన్నారు.

వీల్ చైర్స్ పంపిణీ

విశాలాంధ్ర - పద్మనాభం: పద్మనాభం మండలం పాండ్రంగి పంచాయతీకి చెందిన ముత్యాలమ్మకు, వెంకటాపురం పంచాయతీకి చెందిన బుచ్చిబాబుకు, రౌతులపాలెం గ్రామానికి చెందిన అప్పయ్యమ్మకు శ్రీ గంటా శారదమ్మ హెల్పింగ్ హాండ్స్ వారి సహకారంతో వీల్ చైర్స్ పంపిణీ చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో గంటా శారదమ్మ, శ్రీనివాస సేవా సంఘం అధ్యక్షులు కోన సన్యాసి నాయుడు, మాజీ అధ్యక్షులు పతివాడ ఇంద్రరావు, సభ్యులు శీర కనక, సుంకరి వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

నాదెండ్ల మనోహర్‌ను కలిసిన మండల నాయకులు

విశాలాంధ్ర - ఆనందపురం: ఆనందపురం మండలం జనసేన పార్టీ నాయకులు జనసేన పార్టీ పిఎసి చైర్మన్ రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్‌ను భీమిలి జనసేన ఇన్‌చార్జ్ సందీప్ ఆధ్వర్యంలో మండల నాయకులు మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మండలానికి కావలసిన నామినేటెడ్ పోస్టులు భర్తీపై జనసేన పార్టీకి కేటాయించాలని ఈ సందర్భంగా మంత్రికి తెలిపారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జ్ సందీప్ పంచకర్ల, సీనియర్ నాయకులు శ్రీనుబాబు, కృష్ణయ్య, ప్రధాన కార్యదర్శి కోరుకొండ మూర్తి, బోద్దాపు గోవింద్, ఉపాధ్యక్షులు బాలు, కార్యదర్శి డాక్టర్ పి.సన్యాసిరావు, సురేష్, నాని, తదితర నాయకులు పాల్గొన్నారు.

విశాఖ స్టీల్‌ప్లాంట్ అమ్మకం రద్దు చేయాలి

సొంత గనులు కేటాయిస్తూ ప్రధాని మోడీ ప్రకటించాలి

– జిల్లా జెఏసి నేతలు డిమాండ్

విశాలాంధ్ర - విశాఖ కలెక్టరేట్: ఈనెల 8న విశాఖ పర్యటనకు విచ్చేయుచున్న ప్రధాన మంత్రి నరేంద్రమోడీ విశాఖ స్టీల్‌ప్లాంట్ అమ్మకాన్ని రద్దు చేస్తున్నట్లు, సొంతగనులు కేటాయిస్తున్నట్లు, ప్లాంట్‌ను పూర్తిస్థాయి ఉత్పత్తి సామర్థ్యంతో నడిపించేందుకు అన్ని వనరులు కేటాయిస్తున్నట్లు స్పష్టంగా ప్రకటించాలని జిల్లా కార్మిక, ప్రజాసంఘాల జెఏసి డిమాండ్ చేసింది. సోమవారం జెఏసి సమావేశం జిల్లా సిఐటియు కార్యాలయంలో సిఎఫ్‌టియుఐ జాతీయ అధ్యక్షులు ఎన్.కనకారావు అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశంలో జెఏసి చైర్మన్ ఎం.జగ్గు నాయుడు, వైస్ చైర్మన్ బి.నాగభూషణం (ఐఎన్‌టి యుసి), వైస్ చైర్మన్ ఎం.మన్మథరావు (ఎఐటియుసి), సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్.కె.ఎస్. వి.కుమార్, ఎఐసిటియు జిల్లా కార్యదర్శి కె.శంకర రావు, పబ్లిక్ సెక్టార్ కో ఆర్డినేషన్ కమిటీ కన్వీనర్ ఎస్.జ్యోతీశ్వరరావు, శ్రామిక మహిళా జిల్లా కన్వీనర్ పి.మణి, మున్సిపల్ యూనియన్ ప్రధాన కార్యదర్శి యు.రాజు, ఐద్వా జిల్లా కార్యదర్శి వై.సత్యవతి, కెవిపిఎస్ జిల్లా నాయకులు వై.రాజు, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ఎల్.జె.నాయుడు, డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి కె.సంతోష్‌కుమార్, ప్రజా నాట్యమండలి జిల్లా కార్యదర్శి ఎం.చంటి తదితరులు ప్రసంగించారు. రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, రాష్ట్ర మంత్రి నారా లోకేష్‌లు స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ జరగదని ప్రకటనలు చేస్తున్నారని, కానీ కేంద్ర మోడీ ప్రభుత్వం స్టీల్ ప్లాంట్‌కు సొంతగనులు, వర్కింగ్ కేపిటల్ ఇవ్వడంలేదన్నారు. పూర్తి ఉత్పత్తి సామర్థ్యంతో ప్లాంట్‌ను నడవనివ్వడం లేదన్నారు. కార్మికులకు, ఉద్యోగులకు జీతాలివ్వడం లేదన్నారు. నిర్వాశితులకు ఉద్యోగా లివ్వడం లేదన్నారు. ప్లాంట్‌లో 5వేల ఉద్యోగ ఖాళీలు భర్తీచేయడం లేదన్నారు. పైగా పర్మినెంట్, కాంట్రాక్టు కార్మికులను తొలగించటానికి పూనుకుంటోందన్నారు. లక్షమందికి ఉపాధి కల్పిస్తున్న వైజాగ్ స్టీల్ ప్లాంట్‌ను నట్టేటముంచుతూ, ప్రక్కనున్న అనకాపల్లి జిల్లా నక్కపల్లిలో ఆర్సెలార్ మిట్టల్ ప్రైవేట్ స్టీల్‌ప్లాంట్ ఏర్పాటుకు ఆఘమేఘాల మీద చర్యలు తీసుకుంటోందని, ఇటీవల ఢిల్లీలో ప్రధానితో సమావేశమైన ముఖ్యమంత్రి విశాఖ ఉక్కు కోసం కాకుండా, మిట్టల్ స్టీల్‌ప్లాంట్‌కు ఇనుప ఖనిజం అంతరాయం లేకుండా సరఫరా చేయాలని, ప్లాంట్ ఏర్పాటుకు అన్ని అనుమతులు త్వరగా అందేలా చర్యలు చేపట్టాలని కోరడం అత్యంత ఆందోళనకరం అన్నారు. విశాఖ స్టీల్‌ప్లాంట్‌పై మోడీ ప్రభుత్వ కుట్రలకు వ్యతిరేకంగా ఈనెల 7, 8 తేదీల్లో జిల్లాలోని అన్ని కార్మిక కేంద్రాలు, పరిశ్రమల వద్ద నిరసనలు చేపట్టాలని, బ్యాడ్జీలు ధరించి విధులు నిర్వహించాలని, కార్మిక ప్రజాసంఘాల ఆధ్వర్యంలో 8న నిరసన కార్యక్రమాలు చేపట్టాలని జెఏసి సమావేశం నిర్ణయించింది. ఈ కార్యక్రమంలో కార్మికులు, ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో జెఏసి భాగస్వామ్య సంఘాల నాయకులు టి.నూకరాజు, కె.కుమారి, అగస్తీన్, జి.అజయ్, పి.సాయితేజ, జి.పల్లవి పాల్గొన్నారు.

గుర్తుతెలియని వాహనం ఢీకొని జింక మృతి

విశాలాంధ్ర - పీఎం పాలెం: మధురవాడ, బోరవానిపాలెం జంక్షన్ ఆంజనేయస్వామి గుడి దగ్గర గుర్తుతెలియని వాహనం ఢీకొని జింక మృతి చెందడంతో స్థానికంగా తీవ్ర కలకలం రేపింది. సమాచారం అందుకోవడంతో ట్రాఫిక్ పోలీసులు, ఫారెస్ట్ అధికారులు వచ్చి మృతి చెందిన జింకను జంతు ప్రదర్శనశాలకు తరలించారు.

గేమ్స్ అండ్ స్పోర్ట్స్ పోటీల్లో పాలిటెక్నిక్ విద్యార్థినుల ప్రతిభ

విశాలాంధ్ర - భీమిలి: జనవరి 2,3,4వ తేదీలలో నిర్వహించిన జిల్లా స్థాయి ఇంటర్ పాలిటెక్నిక్ గేమ్స్ అండ్ స్పోర్ట్స్ పోటీలలో భీమునిపట్నం పాలిటెక్నిక్ విద్యార్థినులు ఓవరాల్ ఛాంపియన్‌షిప్ కైవసం చేసుకున్నారు. ఈ కళాశాల విద్యార్థినులు వరుసగా మూడవసారి ఈ ఓవరాల్ ఛాంపియన్‌షిప్ గెలుచుకుని హ్యాట్రిక్ సాధించారు. శబ్నం పర్వీన్, లెక్చరర్ ఇన్ సీఈవో డిపార్ట్మెంట్, ఇన్‌ఛార్జ్ ఫిజికల్ డైరెక్టర్ వీరికి శిక్షణనిచ్చి విజేతలుగా నిలిచేలా చేశారు. ప్రిన్సిపల్ డా సిహెచ్ మురళీకృష్ణ విద్యార్థినీలను అభినందించారు.

వసుంధర ట్రేడర్స్ ప్రారంభం

విశాలాంధ్ర - గోపాలపట్నం: గ్రేటర్ విశాఖ గోపాలపట్నంలో వసుంధర ట్రేడర్స్ ప్రారంభమైంది. ఈ ప్రారంభోత్సవానికి ముఖ్య అతిథిగా రాష్ట్ర యువశక్తి అవార్డు గ్రహీత కళాసేవ పీఠం వ్యవస్థాపక అధ్యక్షులు నందవరపు సోములు హాజరై ప్రారంభించారు. నాణ్యమైన వస్తువులు బ్రాండ్లతో కూడినవి ఇవ్వడం చాలా ఆనందదాయకమని, దినదినాభివృద్ధి చెందాలని ఆశాభావం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో పారిశ్రామికవేత్త తెప్పల శాంతారం ప్రారంభ కొనుగోలు చేశారు. సురేష్ స్టూడియో అధినేత చందు సుబ్బారావు కౌంటర్లు ప్రారంభించారు. కార్యక్రమంలో కళా పీఠం మాజీ అధ్యక్షులు గోరకల రామదాసు, సిగ లక్ష్మీనారాయణ, డాక్టర్ తేజ, డాక్టర్ దీపిక, గంగా సతీష్ కుమార్, అనుపమ కొనుగోలు కార్యక్రమంలో భాగస్వామ్యం అయ్యారు. వసుంధర ట్రేడర్ ట్రేడర్స్ అధినేత గోరకల సాయి సూర్య రఘువర్మ అందరికీ ప్రత్యేక బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో గోపాలపట్నం పరిసర ప్రాంత ప్రముఖులు పాల్గొన్నారు.

ఉక్కు పరిరక్షణకు కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉంది

గాజువాకలో కూటమి నేతలతో ఎమ్మెల్యే పల్లా భేటీ

విశాలాంధ్ర - గాజువాక: కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక తొలిసారిగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని విశాఖకు విచ్చేస్తున్న ప్రధాన మంత్రి నరేంద్ర మోదీకి రాష్ట్రం తరపున అఖండ స్వాగతం పలుకుతున్నట్లు టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు, గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు తెలిపారు. ఈ మేరకు పాత గాజువాక పార్టీ కార్యాలయం ఆవరణలో కూటమి ముఖ్య నేతలతో విస్తృత స్థాయి సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రధాని పర్యటనను ప్రతిష్టాత్మకంగా తీసుకుంటున్నట్లు తెలిపారు. నగరంలోని సంపత్ వినాయక ఆలయం నుంచి సభ జరిగే ఏయూ ఇంజినీరింగ్ గ్రౌండ్స్ వరకు దారిపొడవునా ఆయనకు ఘన స్వాగతం పలికేందుకు ఏర్పాట్లు చేస్తున్నామని చెప్పారు. కోట్లాది రూపాయలతో చేపట్టే అనేక ప్రాజెక్టులకు రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్‌తో కలిసి శంకుస్థాపన చేయనున్నారని తెలిపారు. విశాఖ స్టీల్ ప్లాంట్‌పై ఎలాంటి ఆందోళన చెందాల్సిన పనిలేదని ప్లాంట్ పరిరక్షణకు కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని అన్నారు.

ఆర్థిక కష్టాల నుంచి ప్లాంట్‌ను కాపాడింది ఎన్డీయే కూటమి అన్నది ప్రతి ఒక్కరూ తెలుసుకోవాలన్నారు. నియోజకవర్గ టీడీపీ సమన్వయకర్త ప్రసాదుల శ్రీనివాసరావు అధ్య క్షతన జరిగిన కార్యక్రమంలో జనసేన పీఏసీ సభ్యుడు కోన తాతారావు, భాజపా గాజువాక కన్వీనర్ కరణంరెడ్డి నరసింగరావు, కూటమి కార్పొరేటర్లు పల్లా శ్రీనివాస్, దల్లి గోవింద్ రెడ్డి, జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షుడు పుచ్చా విజయ్ కుమార్, నేతలు గడసాల అప్పారావు, విజయ్ కుమార్, అనంత లక్ష్మీ, కృష్ణంరాజు, ఇల్లపు ప్రసాద్, పాల్తేటి పెంటారావు, మహమ్మద్ రఫీ, జ్యోతి, భువనేశ్వరి, పల్లా రమణ, ముసలయ్య, గోమాడ వాసు, సింగూరు అనంత్ తదితరులు పాల్గొన్నారు.

సీపీఐ సీనియర్ నేత చెల్లూరు అప్పారావు మృతి

విశాలాంధ్ర – తగరపువలస: సీపీఐ సీనియర్ నేత చెల్లూరు అప్పారావు మృతి చెందారు. సీపీఐ నాయకులు కానూరి రాంబాబు ఆధ్వర్యంలో కామ్రేడ్ చెల్లూరి అప్పారావుకి అంతిమ వీడ్కోలు చెబుతూ ఎర్రజెండాలు పట్టుకొని ఘన నివాళులర్పించారు. అప్పారావు ఒక సాధారణ కుటుంబంలో జన్మించి ఉన్నతమైన కమ్యూనిస్టు పార్టీ ఆశయాలను అలవర్చుకొని ఎర్రజెండా ఈ దేశానికి సరైన మార్గం అని నమ్మిన వ్యక్తి అని కొనియాడారు. నివాళులర్పించిన వారిలో అప్పలరాజు, ఈశ్వరరావు, రామ్ పైడి, చిల్లపులు సూరి, ఆదినారాయణ, వీర్రాజులు ఉన్నారు.

టీడీపీ నేతల కబ్జా నుండి ప్రభుత్వ భూములను కాపాడండి

తహశీల్దార్‌కు సీపీఐ వినతి

విశాలాంధ్ర - పెందుర్తి: పెందుర్తి రెవెన్యూ సర్వే నెం 190/9, చిన్న ముషిడివాడ రెవెన్యూ సర్వే నెంబర్ -194-2, లక్ష్మీపురం రెవెన్యూ సర్వే నెంబర్ - 91లలో కబ్జాకు గురవుతున్న ప్రభుత్వ భూములను కాపాడి, కబ్జాదారులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరుతూ సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు ఆర్.శ్రీనివాసరావు, జిల్లా సమితి సభ్యులు వై.రాంబాబు తహశీల్దార్ ఆనంద్ కుమార్‌కు సోమవారం వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా సీపీఐ నాయకులు మీడియాతో మాట్లాడుతూ పెందుర్తి రెవెన్యూ పరిధి సర్వే నెం 190/9లో 18 సెంట్లు ప్రభుత్వ భూమిని టీడీపీ నాయకులు ఆక్రమించుకున్నారని, అలాగే చినముషిడివాడ పంచాయతీ పరిధిలో గల సర్వే నెం 194-2లో కొన్నాళ్ళ క్రితం సేనాపతి వసంత శంకర్రావు కబ్జా చేసి రెండంతస్తుల భవనాన్ని నిర్మించారని, ఇపుడు మళ్ళీ ఆ భవనం వెనుక మరో నిర్మాణం కొరకు రాత్రుల సమయంలో లారీలతో గ్రావెల్ తరలించి ప్రభుత్వ భూమిని చదును చేస్తున్నారని తెలిపారు. వారి ఆక్రమణలపై ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా రెవెన్యూ సిబ్బంది ఎటువంటి చర్యలు తీసుకోకపోవడంతో వారు మరింతగా ఆక్రమణలకు పాల్పడుతున్నారని చెప్పారు. లక్ష్మీపురం రెవెన్యూ పరిధి సర్వే నెంబర్-91లో అక్రమంగా వాణిజ్య దుకాణాన్ని నిర్మిస్తున్నారని ఆరోపించారు. ఇప్పటికైనా స్పందించి కబ్జాదారుల నుండి ప్రభుత్వ భూములను కాపాడాలని శ్రీనివాసరావు, రాంబాబు తహశీల్దార్‌కు విజ్ఞప్తి చేశారు.

గీతంలో ఫైజర్ బిఎస్సీ కెమిస్ట్రీ కోర్సు ప్రారంభం



విశాలాంధ్ర - మధురవాడ: ఉత్తరాంధ్ర జిల్లాలలోని గ్రామీణ ప్రాంతాలలో బాలికల అభ్యున్నతి కోసం ప్రపంచ ప్రఖ్యాత ఔషధ పరిశ్రమ ఫైజర్ హెల్త్ కేర్ ఇండియా లిమిటెడ్ సంస్థ గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయంతో కలసి నిర్వహిస్తున్న బిఎస్సీ కెమిస్ట్రీ కోర్సు 4వ బ్యాచ్ శిక్షణ కార్యక్రమాలు సోమవారం ఘనంగా ప్రారంభమైంది. ఈ కోర్సులో ప్రవేశానికి బాలికలను వివిధ గ్రామాలకు వెళ్ళి స్వయంగా ఎంపిక చేసుకుని ఉద్యోగంతోపాటు గీతం ద్వారా బిఎస్సీ, కెమిస్ట్రీ కోర్సులో ప్రవేశం కల్పించడం చేస్తున్నారు. ఫైజర్ అటానమస్ టీమ్స్ (ప్యాట్) పేరిట బిఎస్సీ కెమిస్ట్రీ కోర్సులో ప్రవేశం పోందిన బాలికలకు ఉద్యోగంతో పాటు డిగ్రీ పూర్తి చేసేంతవరకు ఫైజర్ కంపెనీ సహాయం అందిస్తోంది. కాగా గీతం డీమ్డ్ విశ్వ విద్యాలయంలో 4వ బ్యాచ్ శిక్షణ ప్రారంభం సందర్భంగా ఫైజర్ విశాఖ అధిపతి మురళీధర శర్మ మాట్లాడుతూ 175 సంవత్సరాల చరిత్ర గల ఫైజర్ సంస్థ ప్రపంచ ఫార్మసీ రంగంలో 5వ స్థానంలో ఉందని, కోవిడ్ సమయంలో వ్యాక్సిన్ తయారీ ద్వారా ఎందరో ప్రజల ప్రాణాల కాపాడామన్నారు. గీతంతో కలసి నిర్వహిస్తున్న బిఎస్సీ కెమిస్ట్రీ కోర్సులో ఇప్పటి వరకు 350 మంది గ్రామీణ బాలికలకు అవకాశం కల్పించామన్నారు. ఈ కోర్సులో ప్రవేశం పొందే ప్రతి ఒక్కరు 10 సంవత్సరా లలో నాయకత్వ లక్షణాలతో బహుముఖ ప్రజ్ఞతో వ్యవహరించే విధంగా గీతంతో సంయుక్తంగా కలిసి కోర్సును రూపొందించామన్నారు. గీతంలోని మౌలిక సదు పాయాలు అంతర్జాతీయ స్థాయిలో న్నాయని ప్రశంసించారు. వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ వై.గౌతమ్‌రావు మాట్లాడుతూ బాలికా విద్యకు ఫైజర్ సంస్థ ఇస్తున్న ప్రాధాన్యత అభినందనీయమన్నారు. గీతం ఇనిస్టిట్యూట్ ఆఫ్ సైన్స్ రసాయన శాస్త్ర విభాగం అధిపతి ప్రొఫెసర్ ఎన్.వి.ఎస్. వేణుగోపాల్ మాట్లాడుతూ పరిశ్రమల అవసరాలకు తగిన విధంగా తాము కోర్సులు రూపొందిస్తున్నామని పేర్కొన్నారు. కేంద్ర పరిశోధన సంస్థల సహకారంతో రూ. 1.23 కోట్ల విలువైన పరిశోధనా ప్రాజెక్టులు నిర్వహణలో ఉన్నాయని వెల్లడించారు. గీతం ప్రొఫెసర్‌ల పర్యవేక్షణలో బిఎస్సీ కెమిస్ట్రీ కోర్సును అభ్యసించడం విద్యార్థినులకు మంచి అవకాశం అన్నారు.

కార్యక్రమంలో స్కూల్ ఆఫ్ సైన్స్ డీన్ ప్రొఫెసర్ కె.ఎస్.కృష్ణ, ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ కె.వేదవతి, కోర్సు కో-ఆర్డినేటర్ డాక్టర్ పి.మురళీధర్, ఫైజర్ ప్రతినిధులు పాల్గొన్నారు.

నేటి మధ్యాహ్నం నుండి సర్వ దర్శనాలు

విశాలాంధ్ర - సాగర్‌నగర్: రుషికొండలో గల శ్రీ మహాలక్ష్మి గోదాదేవి సహిత శ్రీ వెంకటేశ్వరస్వామి ఆలయంలో (టిటిడి) మంగళవారం మధ్యాహ్నం 12 గంటల నుండి భక్తులకు సర్వదర్శనాలు నిర్వహిస్తామని ఆలయ ఏఈఓ జగన్మోహనాచార్యులు తెలిపారు. ఈ నెల 10వ తేదీన వైకుంఠ ఏకాదశి సందర్భంగా తిరుమల తిరుపతి దేవస్థానం సాంప్రదాయం ప్రకారం ముందుగా వచ్చే మంగళవారం ఆలయ శుద్ధి, కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం నిర్వహిస్తారని, ఈ మేరకు మంగళవారం ఉదయం నుండి మధ్యాహ్నం వరకు ఆలయాన్ని సుగంధ ద్రవ్యాలతో శుద్ధి చేసి, అనంతరం భక్తులకు యధావిధిగా సర్వదర్శనాలు కొనసాగిస్తామని గమనించాలని కోరారు.

ఉత్తరాంధ్ర వైభవాన్ని చాటి చెబుదాం: అచ్చెన్న

విశాలాంధ్ర బ్యూరో - విశాఖపట్నం: ప్రధాని మోదీ విశాఖ పర్యటన విజయం చేద్దామని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు అన్నారు. ఈనెల 8 తేదీన విశాఖపట్నం రానున్న నేపథ్యంలో సహచర మంత్రులు, పార్లమెంట్ సభ్యులు ఉత్తరాంధ్ర ప్రజాప్రతినిధులు, అధికారులతో కలిసి విశాఖ సర్క్యూట్ హౌస్‌లో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బహిరంగ సభ చరిత్రలో నిలిచి పోయే విధంగా చేద్దామని అన్నారు. ఉత్తరాంధ్ర వైభవాన్ని చాటి చెప్పే విధంగా ఉండాలని అన్నారు. పలు అభివృద్ధి కార్యక్రమాలను ప్రధానమంత్రి మోదీ శంకుస్థాపన చేయనున్నారని తెలిపారు. రాష్ట్ర అభివృద్ధికి ఎంతగానో దోహదపడుతుందని అన్నారు. ఎక్కడ ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ముందస్తుగా అన్ని ఏర్పాట్లు పూర్తి చేద్దామని అన్నారు. అధికారులు, ప్రజా ప్రతినిధులు, అందరూ సహకారంతో మోదీ పర్యటన విజయవంతం చేద్దామని అన్నారు. పార్లమెంట్ సభ్యులు సీఎం రమేష్, వైద్య ఆరోగ్యశాఖ మంత్రి సత్య కుమార్ యాదవ్, నేతలు పాల్గొన్నారు.

HINDUJA HOUSING FINANCE

హిందూజా హౌసింగ్ ఫైనాన్స్ లిమిటెడ్

CIN U65922TN2015PLC10093, www.hindujahousingfinanace.com

రిజిస్టర్డ్ కార్యాలయం : 167-169, 2వ అంతస్తు, అన్నాసలై, సైదాపేట్, చెన్నై-600 015, తమిళనాడు, ఇండియా. ప్రాంతీయ కార్యాలయం: హిందూజా హౌసింగ్ ఫైనాన్స్ లిమిటెడ్, డి.నం.54-20-10/1ఎ, ప్లాట్ నం: 43, 3వ అంతస్తు, ఎస్బీఐ బ్యాంక్ ఎదుట, మెయిన్‌రోడ్డు, గురునానక్ కాలనీ, విజయవాడ-520 008.

అనుబంధం-4 స్వాధీనత ప్రకటన (స్థిర ఆస్తి కొరకు)

ఇందుమూలంగా తెలియజేయునది ఏమనగా.. హిందూజా హౌసింగ్ ఫైనాన్స్ లిమిటెడ్ (హెచ్‌హెచ్ఎఫ్ఎల్) అధీకృత అధికారిగా దిగువ సంతకందారు సెక్యూరిటైజేషన్ అండ్ రికన్‌స్ట్రక్షన్స్ ఆఫ్ ఫైనాన్షియల్ ఎసెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ చట్టం, 2002 మరియు సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) నిబంధనలు, 2002, నిబంధన 3తో చదివే సెక్షన్ 13(12) క్రింద సంక్రమించిన అధికారాలను వినియోగించి నోటీసులో ప్రస్తావించిన బకాయి మొత్తాన్ని సదరు నోటీసు అందిన 60 రోజులలోగా చెల్లించవలసిందిగా కింద ప్రస్తావించిన రుణగ్రహీత(లు) / హామీదారు(లు) లకు పిలుపు నిస్తూ అధీకృత అధికారి ద్వారా డిమాండ్ నోటీసు(లు) జారీ చేయడమైనది. రుణగ్రహీత బకాయి మొత్తాన్ని తిరిగి చెల్లించడంలో విఫలమైనందున సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) నిబంధనలు 2002 యొక్క నిబంధన 8తో చదివే చట్టం యొక్క సెక్షన్ 13 లోని ఉప సెక్షన్ (4) కింద అతనికి సంక్రమించిన అధికారాలను వినియోగించి ఈ కింద వివరించబడిన ఆస్తులను దిగువ సంతకందారు స్వాధీనం చేసుకున్నట్లు రుణగ్రహీత(లు) / హామీదారు(లు) మరియు సాధారణ ప్రజలకు ఇందుమూలంగా నోటీసు ఇవ్వడమైనది. హామీ పెట్టబడిన ఆస్తిని విడిపించు కోడానికి అందుబాటులో ఉన్న సమయానికి సంబంధించి చట్టంలోని సెక్షన్ 13 యొక్క ఉపసెక్షన్ (8) నిబంధనలను గమనించవలసిందిగా రుణగ్రహీత‌లను కోరడమైనది. ఈ ఆస్తితో ఎటువంటి లావాదేవీలు నిర్వహించరాదని, ఈ ఆస్తితో ఏదేని లావాదేవీలు ఈ కింద పేర్కొన్న బకాయి మొత్తం మరియు దానిపై వడ్డీకి గాను హెచ్‌హెచ్ఎఫ్ఎల్ చార్జికి లోబడి వుంటాయని ప్రత్యేకించి రుణగ్రహీత మరియు సాధారణ ప్రజలను ఇందుమూలంగా హెచ్చరించడమైనది.

వ. సం.	రుణగ్రహీత(లు)/సహ-రుణగ్రహీత(లు) పేరు	డిమాండ్ నోటీసు తేదీ & బాకీ మొత్తం	స్వాధీనత తేదీ
1	1.శ్రీ అకుల వెంకట బాల శివకృష్ణ....రుణగ్రహీత, 2.శ్రీమతి అకుల ఈశ్వరమ్మ....1వ సహ-రుణగ్రహీత, ఆర్/ఓ.. డోర్ నం. 17-35-30-10, పితానివానిపాలెం, పెదగంట్యాడ పోస్ట్, నడుపూరు, విశాఖపట్నం, ఏపి-530044 - రుణఖాతా సంఖ్య : AP/VKP/VSKP/A000000691	15-10-2024 రూ. 10,13,903/- (పది లక్షల పదమూడు వేల తొమ్మిది వందల మూడు రూపాయలు మాత్రమే)	30.12.2024
	ఆసక్తి సృష్టించబడిన హామీగా పెట్టిన ఆస్తి వివరాలు: విశాఖపట్నం జిల్లా, పెదగంట్యాడ రిజిస్ట్రేషన్ సబ్ జిల్లా పరిధి, జీవిఎంసి, విశాఖపట్నం పరిధిలో పెదగంట్యాడ గ్రామం & మండలం యాతపాలెం ఏరియాలో ఉన్న సర్వేనం.159/1 ద్వారా వ్యాపించియున్నది, విద్యుత్ సర్వీస్ కనెక్షన్ నం.1111921274-017154, వాటర్ అసెస్మెంట్ నం.1086225177, పాత అసెస్మెంట్ నం.520100/1088135303, కొత్త అసెస్మెంట్ నం.1086294698, డోర్ నం.17-35-30/23/1 ఆధారంగా గ్రౌండ్ ఫ్లోర్‌లో 950 చదరపు అడుగుల నిర్మిత ఫ్లింత్ ఏరియా ఆర్‌సిసి పైకప్పు ఇల్లు మరియు మొదటి అంతస్తులో 600 చదరపు అడుగుల నిర్మిత ఫ్లింత్ ఏరియాతో ఏసిసి టిన్ షెడ్ కలిగియున్న 120 చదరపు గజాలు లేదా 100.35 చదరపు మీటర్ల విస్తీర్ణపు కొలత స్థలం మొత్తంగా. హద్దులు: తూర్పు: దస్తావేజుదారుకు చెందిన స్థలం, దక్షిణం: ఎన్.కనకరాజుకు చెందిన ఇల్లు, డోర్ నం.17-35-30/6, పడమర: టి.డిల్లేశ్వరికి చెందిన ఇల్లు, డోర్ నం.17-35-30/23/2, ఉత్తరం: సి.సి. రోడ్డు. పెద గంట్యాడ ఎస్ఆర్ఓ. నందు 1.రిజిస్టర్డ్ సెటిల్‌మెంట్ దస్తావేజు నం.6088/2022, తేదీ: 18-11-2022.		
2	1.శ్రీ చింతకాయల గోవింద్....రుణగ్రహీత , 2.శ్రీమతి చింతకాయల గౌరీరత్నం.... సహ-రుణగ్రహీత, ఆర్/ఓ.. 2-58, పుడిమడక, పెద్దూరు, అచ్యుతాపురంమండలం, పుడిమడక, రూరల్, అనకాపల్లి, ఏపి-531011. రుణఖాతా సంఖ్య: AP/VKP/VSKP/A000000609	15-10-2024 రూ.7,47,016/-(ఏడు లక్షల నలభై ఏడు వేల పదహారు రూపాయలు మాత్రమే)	31.12.2024
	ఆసక్తి సృష్టించబడిన హామీగా పెట్టిన ఆస్తి వివరాలు: అనకాపల్లి జిల్లా, యలమంచిలి ఎస్ఆర్ఓ. పరిధి, అచ్యుతాపురం మండలం, పుడిమడక గ్రామంలో గ్రామకంఠం సర్వే నం.128/1 ద్వారా వ్యాపించియున్నది, అసెస్మెంట్ నం.550, 700 చదరపు అడుగుల్లో నిర్మించిన డోర్ నం.4-102 ఆధారంగా ఉన్న ఆర్‌సిసి పైకప్పు ఇల్లుతో కలిసి 104.72 చదరపు గజాలు లేదా 87.55 చదరపు మీటర్ల కొలత స్థలం మొత్తంగా. హద్దులు ఈ కింది విధంగా: హద్దులు: తూర్పు: రోడ్డు, దక్షిణం: యెర్రిపల్లి ముసలయ్య ఇల్లు, పడమర: యెర్రిపల్లి గంటలరావు ఇల్లు, ఉత్తరం: రోడ్డు 1.1. యలమంచిలి ఎస్ఆర్ఓ. నందు 1.1. రిజిస్టర్డ్ సెటిల్‌మెంట్ దస్తావేజు నం.6020/2022, తేదీ: 25-06-2022.		
3	1. శ్రీ పిట్టా శంకరరావు ...రుణగ్రహీత, 2. శ్రీ సురేష్ పిట్టా ...సహ-రుణగ్రహీత, 3. శ్రీమతి మణి పిట్టా... 2వ సహ-రుణగ్రహీత ఆర్/ఓ. డోర్ నం: 3-12, పెదపల్లి పోస్ట్, యెలమంచిలి మండలం, ఎర్రవరం, పాత ఎర్రవరం, రామాలయం దగ్గర, రూరల్, విశాఖపట్నం, ఆంధ్రప్రదేశ్-531055 లోన్ అక్కౌంట్ నం. : AP/VKP/VSKP/A000000236	17-09-2024 రూ.13,33,006/- (పదమూడు లక్షల ముప్పైమూడు వేల ఆరు రూపాయలు మాత్రమే)	31.12.2024
	ఆసక్తి సృష్టించబడిన హామీగా పెట్టిన ఆస్తి వివరాలు: విశాఖపట్నం జిల్లా, యలమంచిలి మండలం, ఎర్రవరం గ్రామంలో ఉన్న సర్వే నం.141-ఎ2, అసెస్మెంట్ నం. 1137007377, డోర్ నం.3-12, ఆధారంగా ఉన్న 222.88 చదరపు గజాల విస్తీర్ణంలో నిర్మించిన మొత్తం 1056 చదరపు అడుగులు (528+528) కొలత ఆర్.సి.సి భవనం యావత్తు. హద్దులు: తూర్పు: మున్సిపల్ రోడ్డు, దక్షిణం: పి అప్పారావుకు చెందిన 1 1/2 అడుగుల ఖాళీ భూమి మరియు పి అప్పలనర్స అస్తి, పడమర: మలపిరెడ్డి చిలకమ్మకు చెందిన అస్తి, ఉత్తరం: పి అప్పారావుకు చెందిన అస్తి.		
4	1. శ్రీ సతీష్ చవ్వాకుల ...రుణగ్రహీత, 2. శ్రీ చవ్వాకుల భీమరాజు...1వ సహ-రుణగ్రహీత, 3. శ్రీమతి చవ్వాకుల నాగమణి... 2వ సహ-రుణగ్రహీత ఆర్/ఓ. హెచ్.నం. 4-49, సత్యనారాయణపురం, సత్యనారాయణ స్వామి గుడి, అనకాపల్లి మండలం, తుమ్మపాల, విశాఖపట్నం-531001.లోన్ అక్కౌంట్ నం. : AP/VKP/ANAK/A000000059	28-09-2024 రూ.8,05,005/- (ఎనిమిది లక్షల ఐదువేల ఐదు రూపాయలు మాత్రమే)	31.12.2024
	ఆసక్తి సృష్టించబడిన హామీగా పెట్టిన ఆస్తి వివరాలు: విశాఖపట్నం జిల్లా, అనకాపల్లి రిజిస్ట్రేషన్ సబ్ జిల్లా, అనకాపల్లి ఎస్ఆర్ఓ., అనకాపల్లి మండలం, సత్యనారాయణపురం పంచాయతీ, సత్యనారాయణపురం హెచ్/ఓ. తుమ్మపాల గ్రామంలో సర్వే నం.682/1 ద్వారా వ్యాపించి ఉన్నది, డోర్ నం.4-49, ప్రస్తుత డోర్ నం.8-29, అసెస్మెంట్ నం.448, ప్రస్తుత అసెస్మెంట్ నం.847 ఆధారంగా 510 చదరపు అడుగుల ఫ్లింత్ ఏరియా కలిగిన ఆర్.సి.సి. పైకప్పు ఇంటితో కలిసి 119.22 చదరపు గజాలు లేదా 100.4 చదరపు మీటర్లు కొలత ఆస్తి మొత్తంగా. హద్దులు: తూర్పు: కడియం సాంబమూర్తి ఇల్లు, దక్షిణం: ఉరిటి అనురాధ ఇల్లు, పడమర: ఉరిటి అనురాధ ఇల్లు, ఉత్తరం: ఈ ఆస్తి మరియు ఇతరుల ఉమ్మడి రాస్తా , రిజిస్టర్డ్ పార్టిషన్ డీడ్ నం. 454/2020, తేదీ: 20-08-2020, ఎస్ఆర్ఓ.-అనకాపల్లి.		

ప్రదేశము : విజయవాడ, తేదీ :07-01- 2025 (అధీకృత అధికారి), హిందూజా హౌసింగ్ ఫైనాన్స్ లిమిటెడ్

విశాలాంధ్ర
విశాఖపట్నం
పేజి : 2
మంగళవారం 7, జనవరి, 2025

గాంధేయ మార్గంలో రైల్వే జోన్ సాధించడం గొప్ప విషయం

అఖిల భారత రైల్వే ఉద్యోగుల సమాఖ్య మాజీ ఉపాధ్యక్షుడు చలసాని గాంధీ

విశాలాంధ్ర - విశాఖ సిటీ: ఉత్తరాంధ్ర ప్రాంత వివక్షతపై గాంధేయ మార్గంలో రైల్వే జోన్ సాధించడం దేశ చరిత్రలోనే గొప్ప పోరాటంగా నిలిచిపోతుందని అఖిల భారత రైల్వే ఉద్యోగుల సమాఖ్య మాజీ ఉపాధ్యక్షుడు, ఈస్ట్ కోస్ట్ రైల్వే శ్రామిక్ యూనియన్ మాజీ ప్రధాన కార్యదర్శి, హింద్ మాజ్దూర్ సభ మాజీ ఆంధ్ర రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చలసాని గాంధీ అన్నారు. గాంధేయ మార్గ పోరాటం ద్వారా రైల్వే జోన్‌ని సాధించిన సందర్భంగా సోమవారం వీజేఎఫ్ ప్రెస్ క్లబ్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రైల్వే జోన్ విజయ సాధనలో మీడియా, కార్మిక సంఘాలు, ప్రజా ప్రతినిధుల పాత్ర కీలకమన్నారు. దక్షిణ కోస్తా రైల్వే జోన్ సాధన వెనుక నాలుగు దశాబ్దాల అవిశ్రాంత పోరాటం ఉందని పేర్కొన్నారు. రైల్వే కోసం ఎవరికి అవగాహన లేని కాలంలో రైల్వే కార్మిక సంఘాలు సామాజిక బాధ్యతతో తమ పరిమితులకు, కట్టుబాట్లకు అతీతంగా పత్రికల సహాయంతో నిత్యం సమస్యలు, వేధింపులు, వివక్షలను ప్రజలకు, ప్రజాప్రతినిధులకు పత్రికల ద్వారా తెలియజేసేవన్నారు. ఉత్తరాంధ్రనే కాక నవ్యాంధ్ర ప్రదేశ్ దశ, దిశ మార్చేసే రైల్వే జోన్ మంజూరై ప్రారంభోత్సవానికి సిద్ధం అయ్యిందన్నారు. స్వర్గీయ గౌతు లచ్చన్న, బాట్టం శ్రీరామ్మూర్తి, ద్రోణంరాజు సత్యనారాయణ, కింజరాపు ఎర్రన్నాయుడు, ఎమ్.వి.వి.ఎస్. మూర్తి మొదలుకొని ప్రస్తుత గౌరవ గవర్నర్లు బండారు దత్తాత్రేయ, కంభంపాటి హరిబాబు, డాక్టర్ యార్లగడ్డ లక్ష్మీ ప్రసాద్, కొణతాల రామకృష్ణ, సిహెచ్.నరసింగరావు, జె.వి.సత్యనారాయణ మూర్తి, ఉత్తరాంధ్ర రక్షణ వేదిక అధ్యక్షులు ఎస్.ఎస్.శివశంకర్ ఎందరో ప్రజా ప్రతినిధులు, కార్మిక నాయకులు గత 40 ఏళ్లలో ఉద్యమాన్ని సజీవంగా ఉంచాయని తెలియజేశారు.

అభయాంజనేయ ఆలయాభివృద్ధికి విరాళం

విశాలాంధ్ర - ఆనందపురం: పెద్దిపాలెం గ్రామానికి చెందిన మాజీ నీటి సంఘం అధ్యక్షులు కూరకుల వెంకటేశ్ తన తల్లిదండ్రుల జ్ఞాపకార్థం అభయాంజనేయ ఆలయాభివృద్ధికి 30 వేల రూపాయలను విరాళంగా అందజేశారు. సోమవారం స్థానిక కింగ్స్ ఫంక్షన్ హాల్లో కీర్తిశేషులు కూరాకుల సంజీవరావు, అప్పలకొండమ్మ దంపతుల జ్ఞాపకార్థం పంచాయతీ పరిధిలో పలువురికి సన్మాన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంకు ముఖ్య అతిథులుగా ప్రముఖ వైద్యులు బి.కృష్ణారావు, ధనలక్ష్మి సొసైటీ డైరెక్టర్ వై.అజయ్ శేఖర్, స్టేట్ బ్యాంక్ మేనేజర్ ఎం.గోవిందరావు, కింగ్ ఫ్యూయల్ అధినేత ఎన్.రేవంత్ కుమార్ రాజు, శ్రీరాం ఫైనాన్స్ జీఎం కూరాకుల వాసులు హాజరయ్యారు. పంచాయతీలో ప్రస్తుత సర్పంచ్, ఎంపీటీసీలు, మాజీ సర్పంచ్, ఎంపీటీసీలతోపాటు వివిధ రంగాల్లో రాణిస్తున్న పలువురికి ముఖ్య అతిధులు చేతులు మీదుగా సన్మానాలు నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ నీటి సంఘం అధ్యక్షుడు కూరాకుల వెంకటేశ్ మాట్లాడుతూ తన తల్లిదండ్రుల జ్ఞాప కార్థం ట్రస్టును ఏర్పాటు చేసి పలు సేవా కార్యక్రమాలు చేపట్టడానికి నిర్ణయిం చామన్నారు. ఈ సందర్భంగా గ్రామంలో ఉన్న అభయాం జనేయ ఆలయా భివృద్ధికి 30 వేల రూపాయలు విరాళంగా అందిస్తున్న ప్రకటించి ఆలయ నిర్మాణ ధర్మకర్త బావిశెట్టి ప్రసాద్‌కు అందజేశారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ కోరాడ వెంకటరావు, మాజీ సర్పంచ్ మరుపిళ్ల చిన్నయ్యపాత్రుడు, సర్పంచ్ బావిశెట్టి రాజు, విఆర్ వోఽల సంఘం జిల్లా అధ్యక్షుడు పోతిన వెంకట అప్పారావు, గుండు నానాజీ, కూరాకుల మురళి, కురాకుల ఈశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

దేవర శివ సేవలు అభినందనీయం

5వ వార్డు కార్పొరేటర్ మొల్లి హేమలత

విశాలాంధ్ర - మధురవాడ: దేవర శివ సేవలు అభినందనీయమని 5వ వార్డు కార్పొరేటర్ మొల్లి హేమలత అన్నారు. 5వ వార్డు జనసేన అధ్యక్షులు దేవర శివ ఆర్థిక సాయంతో పరదేశపాలెం అంగన్వాడీ కేంద్రానికి బీరువా, పిల్లలకు కావాల్సిన సామాగ్రి సోమవారం అందజేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన మొల్లి హేమలత మాట్లాడుతూ అంగన్వాడీ పిల్లలకు కావాల్సిన సౌకర్యాలు తెలుసుకొని దేవర శివ సొంత నిధులతో ఏర్పాటు చేయడం సంతోషకరమన్నారు. దేవర శివ మాట్లాడుతూ అంగన్వాడీ కేంద్రంలో ఉన్న సమస్యలు తమ దృష్టికి వచ్చినప్పుడు జనసేన పార్టీ తరుపున సేవ చేయాలనే ఆలోచనతోనే ఈ కార్యక్రమం ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. అంగన్వాడీ సిబ్బంది కూడా పిల్లలకు పౌష్టికాహారం అందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు శ్రీకాంత్, బోరా వెంకటేష్, సూరిబాబు, ఎర్రయ్య, బత్తిన శివ, రవి, రామకృష్ణ, వరలక్ష్మి, సుజాత, కృష్ణ, సురేష్, మహేశ్వరి, టీడీపీ నాయకులు కొండపు రాజు, రెడ్డి, శివ తదితరులు పాల్గొన్నారు.

అంగన్వాడీ కార్యక్రమాలపై అవగాహన

విశాలాంధ్ర - పెందుర్తి: అంగన్వాడీ కేంద్రంలో నిర్వహిస్తున్న కార్యక్రమాలపై పిల్లలు తల్లిదండ్రులకు జీవీఎంసీ 96 వార్డు నల్ల క్వారీ కేంద్రంలో అంగన్వాడీ కార్యకర్త బుద్ధ భవాని అవగాహన కల్పించారు. సోమవారం ఉదయం అంగన్వాడీ కేంద్రంలో తల్లిదండ్రులు, పిల్లలతో సమావేశమై ప్రభుత్వం ద్వారా అందిస్తున్న సంక్షేమ పథకాలు ప్రయోజనాలను వారికి వివరించారు. పిల్లలు గర్భిణీలకు పౌష్టికాహారం అందించడంతోపాటు వారి ఆరోగ్య పరిరక్షణకు చర్యలు చేపడతామని వెల్లడించారు.

మోదీ పర్యటన విజయవంతం చేయాలి

విశాలాంధ్ర - విశాఖ: ప్రధాని నరేంద్ర మోదీ విశాఖ పర్యటనను విజయవంతం చేయాలని టీడీపీ రాష్ట్ర అధ్యక్షులు, గాజువాక ఎంఎల్‌ఏ పల్లా శ్రీనివాస్ కోరారు. సోమవారం సాయంత్రం వీఎంఆర్డీఏ సమావేశ మందిరంలో ఎంఎల్‌ఏలు, ఎంఎల్‌సిలతో ప్రధాని పర్యటనపై సమీక్ష నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రధాని నరేంద్ర మోడీ బహిరంగ సభలో పాల్గొనే ముందు జరిగే రోడ్ షోకి పెద్ద ఎత్తున పార్టీ క్యాడర్ తరలిరావాలని, ఆ దిశగా నాయకులు కృషి చేయాలని కోరారు. మోడీ విశాఖ పర్యటనను రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మంగా తీసుకుందని చెప్పారు. అనంతరం పలు అంశాలపై సమీక్ష చేశారు. ఎంఎల్‌ఏ లు వెలగపూడి రామకృష్ణ బాబు, గణబాబు మాట్లాడుతూ ప్రధాని మోడీ ఉత్తరాంధ్ర అభివృద్ధికి కీలకమైన పలు ప్రాజెక్టులకు శంకుస్థాపన చేయనున్నారని, అందుకు క్యాడర్ మొత్తం తరలి రావాలని విజ్ఞప్తి చేశారు. ఎం ఎల్ సి లు చిరంజీవిరావు, దువ్వాడ రామారావు, వీఎంఆర్డీఏ చైర్ పర్సన్ ఎం వి ప్రణవ్ గోపాల్, ఇతర ముఖ్య నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పలువురు నాయకులకు పలు కీలక బాధ్యతలు అప్పగించారు.

ఘనంగా స్క్విడ్ గేమ్ సీజన్ 2 నిర్వహణ

విశాలాంధ్ర- విశాఖపట్నం: నెట్ఫ్లిక్స్ వారి రికార్డ్ బ్రేకింగ్ సిరీస్ 'స్క్విడ్ గేమ్' రెండవ సీజన్ కోసం సీగ్రమ్స్ రాయల్ స్టాగ్ కొలాబరేట్ చేసింది. ఈ కొలాబరేషన్, రాయల్ స్టాగ్ వారి 'లివ్ ఇట్ లార్జ్' సిద్ధాంతాన్ని అందించింది. కె-డ్రామా, యువతరాన్ని ఎంతగానో ఆకట్టుకుంటున్నది. కొలాబరేషన్ను గురించి మాట్లాడుతూ పెర్నాడ్ రికార్డ్ ఇండియా జనరల్ మేనేజర్ జోయ్దీప్ బసూరాయ్ "నెట్ఫ్లిక్స్ వారి స్క్విడ్ గేమ్తో రాయల్ స్టాగ్ వారి అనుబంధం కారణంగా బ్రాండ్, కె-సంస్కృతి పట్ల యువతరానికి ఉన్న వీరాభిమానాన్ని, ఇమోషనల్ అనుబంధాన్ని పెంచి, బ్రాండ్ యొక్క యువసాంస్కృతిక భాగాన్ని అందిపుచ్చుకో గలుగుతుందన్నారు.

ముగిసిన జోన్ 1 స్పోర్ట్స్ మీట్

విశాలాంధ్ర-గోపాలపట్నం: గ్రేటర్ విశాఖ 98వ వార్డ్ పరిధిలో ఉన్న మహాత్మ జ్యోతిరావు పూలే వెనుకబడిన బాలుర సంక్షేమ గురుకుల పాఠశాల, కళాశాలలో జోన్ 1 స్పోర్ట్స్ మీట్ ఘనంగా ముగిసింది. ఆయా పోటీల్లో పాల్గొన్న అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులు ప్రధానం చేయటం జరిగింది. వ్యక్తి గత చాంపియన్ ను ప్రథమ స్థానంలో అనకాపల్లికి చెందిన కె.కుమార్, ద్వితీయ స్థానంలో ఏ.హరీష్ సింహాచలం పాఠశాలలు కైవసం చేసుకున్నాయి. ఓవర్ ఆల్ చాంపియన్ షిప్‌ను ప్రథమ స్థానంలో అతిధ్య పాఠశాల, ద్వితీయ స్థానంలో అంపోలు పాఠశాల కైవసం చెకున్నాయని ప్రిన్సిపాల్ రమా మోహిని తెలిపారు. ఆర్.జే.డి విజయ భాస్కర్, ఉత్తరాంధ్ర పాఠశాలల వ్యాయామ ఉపాధ్యాయులు తదితరుల పాల్గొన్నారు.

ఆదర్శలో అంతర్జాతీయ సాంకేతిక దినోత్సవం

విశాలాంధ్ర - పెందుర్తి: స్థానిక ఆదర్శ డిగ్రీ కళాశాలలో అంతర్జాతీయ సాంకేతిక దినోత్సవం ఘనంగా నిర్వహించినట్లు కళాశాల ప్రిన్సిపాల్ ఎన్.ఇ. ఫ్లోరా తెలియజేసారు. ఈ వేడుకలో కళాశాల కరస్పాండెంట్, సెక్రటరీ టి.తియెఫిలస్ మాట్లాడుతూ సాంకేతికత పరిజ్ఞానంతో పాటు నైతిక విలువలకు ప్రాధాన్యత ఇవ్వాలని విద్యార్థులకు వివరించారు. సంబరాలలో భాగంగా విద్యార్థులు సాంకేతిక పరిజ్ఞానం యొక్క ప్రాధాన్యత, సాంకేతిక విభాగంలో జరిగిన అద్భుతమైన పురోగతులను, ఐటి, ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్సి, రోబోటిక్స్, కంప్యూటర్ సైన్సు తదితర సాంకేతిక రంగాల్లో కీలకసాధనలు, ఆవిష్కరణలు పరిణామాలపై పవర్ పాయింట్ ప్రదర్శనలు ఇచ్చారు. ఇందులో బి.సి.ఎ, బి.ఎస్.సి విద్యార్థినిలు ఐశ్వర్య, నందిని, కుష్మిత, గ్రీన్ షా, యాని జాయిసి, యాస్మిన్ ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ వేడుకలలో 100 మంది విద్యార్థులు, ఎన్.ఎస్.ఎస్ మూడు యూనిట్ల ఆఫీసర్లు మంజుల, డి.ఎస్.ప్రదీప్, సంధ్యారాణి, ఉపాధ్యాయ ఉపాధ్యాయేతర సిబ్బంది పాల్గొన్నారు.

ఉత్తరాంధ్ర అభివృద్ధిపై బహిరంగ చర్చకు సిద్ధం

- మాజీ మంత్రి గుడివాడ అమర్నాథ్ సవాల్

విశాలాంధ్ర - విశాఖ సిటీ: ఉత్తరాంధ్ర అభివృద్ధిపై తాను బహిరంగ చర్చకు సిద్ధం అని మాజీ మంత్రి గుడివాడ అమర్నాథ్ సవాలు చేశారు. సోమవారం వైసిపి జిల్లా కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. 15 ఏళ్ల పాటు ముఖ్యమంత్రిగా చేసి ఉత్తరాంధ్రకు చంద్రబాబు ఏమి చేశారో చెబితే బాగుండేదన్నారు. వైఎస్ జగన్ పాలనలో వచ్చిన ప్రాజెక్టులు తమ పాలనలో వచ్చినట్లు టిడిపి నేతలు చెప్పుకుంటున్నారని విమర్శించారు. ప్రధాని నరేంద్ర మోడీ శంకు స్థాపన చేసే ప్రాజెక్టులన్ని వైఎస్ఆర్సీపీ ప్రభుత్వ హయాంలో వచ్చినవేనన్నారు. వైఎస్ జగన్ మీద మాటలాడి లోకేష్ అభాసు పాలయ్యారని, ఏ శాఖ మీద అవగాహన లేకుండా సకల శాఖల మంత్రిగా లోకేష్ తయారయ్యారని ఎద్దేవా చేశారు. శ్రీకుకుళం జిల్లాలో కిడ్నీ రిసెర్చ్ సెంటర్, ములపేట పోర్ట్ నిర్మాణం లోకేష్‌కు కనిపించలేదా అని ప్రశ్నించారు. మెడికల్ కాలేజీలు, భోగాపురం ఎయిర్పోర్ట్ ఎవరి హయాంలో నిర్మాణ పనులు జరిగాయని, ఇన్ఫోసిస్ ఐటి ఎవరి హయాంలో వచ్చిందో తెలియదా అన్నారు. మేము తెచ్చిన టీసీఎస్ మీరు తెచ్చినట్లుగా చెప్పుకుంటున్నారన్నారు. రుషికొండపై అద్భుతమైన భవనం వైఎస్ జగన్ కట్టారు. ఆ భవనాన్ని ప్రధాని, రాష్ట్రపతి అవసరాల కోసం వాడచ్చుకదా అని సూచించారు. విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణ జరగదని ప్రధానితో లోకేష్ చెప్పించగలరా. స్టీల్ ప్లాంట్ కార్మికుల తరుపున అడుగుతున్నాము స్టీల్ ప్లాంట్ ప్రైవేటికరణ జరగదని చెప్పాలని డిమాండ్ చేశారు. గ్రీన్ హైడ్రోజన్ ప్రాజెక్టు నేను మంత్రిగా ఉన్న సమయంలో ఒప్పదం జరిగింది. 1300 ఎకరాలను వైఎస్ఆర్సీపీ ప్రభుత్వం మంజూరు చేసిందని చెప్పారు. ఆ ప్రాజెక్టుకు అన్ని అను మతులు వైఎస్ఆర్సీపీ ప్రభుత్వం ఇచ్చిందన్నారు. టిడిపి హయాంలో బకాయిలు పెట్టిన 50 వేల కోట్లు వైఎస్ జగన్ చెల్లించారని, అప్పు తెచ్చిన లక్ష 20 వేల కోట్లు ఏమి చేశారని నిలదీశారు. పుట్టని బిడ్డకు పేరు ఎలా పెడతారు అంటున్న లోకేష్, వైఎస్ఆర్సీపీ హయాంలో వచ్చిన ప్రాజెక్టులు తమవి అని ఎలా చెప్పుకుంటారని ప్రశ్నించారు. వాలాంటీర్స్ కు 10 వేల రూపాయలు ఇస్తామని ఎలా మేనిఫెస్టోలో పెట్టారో చెప్పాలన్నారు.

నేటి నుంచి ఏపీఈఆర్సీ ప్రజాభిప్రాయ సేకరణ

-ఏపీఈపీడీసీఎల్ సీఎండీ పృథ్వీతేజ్ ఇమ్మడి

విశాలాంధ్ర బ్యూరో - విశాఖపట్నం: ఆంధ్రప్రదేశ్ విద్యుత్ నియంత్రణ మండలి (ఏపీఈఆర్సీ) ఆధ్వర్యంలో 2025-26 ఆర్థిక సంవత్సరానికి వార్షిక ఆదాయ అవసరాలు, రిటైల్ ధరలపై బహిరంగ ప్రజాభిప్రాయ సేకరణ కార్యక్రమం మంగళవారం, బుధవారం రెండు రోజులపాటు విజయవాడలోని 'ఏ' కన్వెన్షన్ సెంటర్‌లో జరగనుందని ఏపీఈపీడీసీఎల్ సీఎండీ పృథ్వీతేజ్ ఇమ్మడి తెలిపారు. ఏపీఈఆర్సీ ఇన్‌ఛార్జ్ చైర్మన్ ఠాకూర్ రామసింగ్, పివిఆర్ రెడ్డి ఆధ్వర్యంలో విద్యుత్ సంస్థల ప్రతిపాదనలకు సంబంధించిన సూచనలు, అభ్యంతరాలు, అభిప్రాయాలను వీడియో కాన్ఫరెన్స్ (వర్చువల్) ద్వారా స్వీకరిస్తారని పేర్కొన్నారు. విజయవాడ కేంద్రంగా వర్చువల్ పద్ధతిలో ఏపీఈఆర్సీ నిర్వహించనున్న ప్రజాభిప్రాయ సేకరణలో ఏపీఈపీడీసీఎల్ పరిధిలోని ప్రజలు పాల్గొనేందుకు అవసరమైన ఏర్పాట్లను సంస్థ ఇప్పటికే పూర్తి చేసిందన్నారు. ప్రజాభిప్రాయ సేకరణలో పాల్గొని విద్యుత్ పంపిణీ సంస్థల ఛార్జీల ప్రతిపాదనల పై అభిప్రాయాలను తెలియచేసేందుకు సంస్థ పరిధిలోని వినియోగదారులు తమ సమీప విద్యుత్ పర్యవేక్షణ ఇంజినీరు (ఎస్‌ఈ), ఎగ్జిక్యూటివ్ ఇంజనీరు (ఈఈ) కార్యాలయాల్లో సంప్రదించి ఏపీఈఆర్సీ వారి అనుమతితో పాల్గొనవచ్చన్నారు. ప్రతీరోజు ఉదయం 10.30 గంటల నుంచి ఒంటిగంట వరకు నేరుగానూ, రెండు గంటల నుంచి సాయంత్రం 4.30 గంటల వరకు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా జరగనున్న ప్రజాభిప్రాయ సేకరణలో వినియోగదారులు, అభ్యంతరదారులు పాల్గొని తమ అభిప్రాయాలను వెల్లడించవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమాన్ని ప్రజలు https://eliveevents.com/apercpublichearing వెబ్ లింక్ ద్వారా ప్రత్యక్ష ప్రసారాన్ని(లైవ్ స్ట్రీమింగ్) వీక్షించే అవకాశాన్ని ఏపీఈఆర్సీ అధికారులు కల్పించారని తెలిపారు.

గ్రాఫైట్ సిరామిక్స్ గ్యాలరీ ప్రారంభం

విశాలాంధ్ర - విశాఖపట్నం: రామా టాకీస్ రోడ్ సెంటర్‌లో ఎక్సెల్ వరల్డ్ పేరుతో ఏర్పాటు చేసిన మొట్ట మొదటి గ్రాఫైట్ గ్యాలరీ సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎక్సెల్ వరల్డ్ ప్రతినిధి ఎస్ఆర్ఎన్ రెడ్డి, ఎస్ఆర్ గ్రాఫైట్ సిరామిక్స్ ప్రతినిధులు రవి పాటీల్, విరాల్ పాటిల్ మాట్లాడుతూ గుజరాత్ రాష్ట్రంలోని మోర్బీ ప్రాంతంలో 12 ఎకరాల స్థలంలో స్థాపించిన గ్రాఫైట్ టైల్స్ కంపెనీ ఉత్పత్తులను ఈ గ్యాలరీలో అందుబాటులో ఉంచుతామన్నారు. గ్రాఫైట్ సెరామిక్స్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ 50 లక్షల చదరపు మీటర్లు వార్షిక ఉత్పత్తి సామర్థ్యం కలిగి 10 రకాల టైల్స్ ఎంపికల కోసం ప్రీమియం సాంప్రదాయక ఉపరితలాలుగా వర్గీకరించి తయారు చేస్తారన్నారు. గ్రాఫైట్ టైల్స్ గ్లేజ్ పాలిష్డ్ గ్లేజ్ విట్రిఫైడ్ టైల్స్‌గా 6000 పైగా రకాలతో కోరుకున్న విధంగా ఫ్లోరింగ్‌ను అందంగా తీర్చిదిద్దుతాయని, అంతే కాక కంపేనీ తమ ఉత్పత్తులను చక్కని ఎలాటి అతుకులు లేని విధంగా అమర్చుటకు వీలుగా ఉంటాయన్నారు. టైల్స్ తయారీలో వినూత్న సాధించుటకు పరిశోధన అభివృద్ధి ల్యాబ్ నిపుణుల పర్యవేక్షణలో నిర్వహి స్తుంటుందన్నారు. గ్రాఫైట్ ఉత్పత్తుల ఈ గ్యాలరీలో 6000కు పైగా విభిన్న తరహా ఉత్పత్తులు అందుబాటులో ఉన్నాయన్నారు.

సినిమా టికెట్ల ధరలు పెంపు సమంజసం కాదు

పీసీసీ ప్రధాన కార్యదర్శి మూల వెంకటరావు

విశాలాంధ్ర - పెందుర్తి : కొత్తగా విడుదలయ్యే సినిమాలకు టికెట్ల రేటు పెంచుకునేందుకు, బెనిఫిట్ షోలు వేసుకునేందుకు అనుమతులు ఇవ్వడం మంచి పద్ధతి కాదని పిసిసి ప్రధాన కార్యదర్శి, ఓబిసి డిపార్ట్మె ంట్ ఇన్చార్జ్ మూల వెంకటరావు అన్నారు. సోమవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ డిమాండ్ అండ్ సప్లై ఆధారంగా సినిమా టిక్కెట్లు రేట్లు పెంచుతున్నామని ఉప ముఖ్యమంత్రి చెప్పడం ఆయన హోదాకు సరిపోదని, ప్రజల అభిమానాన్ని బలహీనతగా చూస్తారా? అని ప్రశ్నించారు. అసలు బెనిఫిట్ షో ద్వారా వచ్చిన ఆదాయాన్ని సామాజిక కార్యక్రమాలకు ఉపయోగించాలని, దానికి విరుద్ధంగా ప్రేక్షకుల అభిమానాన్ని నిర్మాతలు వ్యక్తిగత లాభంగా మలుచుకుంటున్నారని ఆక్షేపించారు. అభిమానుల పట్ల అభిమానం ఉంటే ప్రత్యేకంగా సినిమాలు ప్రదర్శించి ఉచితంగా చూపించాలి లేదా టికెట్ల ధరపై రాయితీ ఇవ్వాలి తప్ప ధరలు పెంచడం అభిమానాన్ని దుర్వినియోగం చేయడమేనని ఆయన పేర్కొన్నారు. ప్రతి హీరో యొక్క అభిమానులలో నూటికి 90 శాతం మంది దిగువ, మధ్య తరగతికి చెందినవారేనని గుర్తు చేశారు. ఆరుగాలం కష్టపడి పంట పండించిన రైతులకు మద్దతు ధరలు కల్పించడంలో మెతక వైఖరి అవలంబించే పాలకులు కోటీశ్వరులైన సినిమా నిర్మాతలకు మేలు చేకూర్చే చర్యలు చేపట్టడం భావ్యం కాదని వెల్లడించారు. బెనిఫిట్ షోలు ద్వారా వచ్చే ఆదాయాన్ని సామాజిక కార్యక్రమాలకు మాత్రమే వినియోగించే విధంగా చట్టం చేయాలని కూటమి ప్రభుత్వానికి ఆయన విజ్ఞప్తి చేశారు. ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, రాష్ట్ర ప్రజలందరి మనిషిగా పెద్ద మనసుతో ఆలోచించి తెలం గాణ ప్రభుత్వంలా సినిమా టికెట్లు ధర పెంపు యోచన విరమించుకోవాలని మూల వెంకటరావు ప్రజల తరపున కోరుతున్నట్లు ప్రకటించారు.

ఎస్‌యూడీ లైఫ్ మిడ్‌క్యాప్ మొమెంటం ఇండెక్స్ ఫండ్ ప్రారంభం

విశాలాంధ్ర - విశాఖపట్నం: స్టార్ యూనియన్ డై ఇచి లైఫ్ ఇన్సురెన్స్ కో లిమిటెడ్ (ఎస్ యూడీ లైఫ్) ఈ కొత్త సంవత్సరంలో ఎస్ యూడీ మిడ్‌క్యాప్ మొమెంటం ఇండెక్స్ ఫండ్‌ను ప్రారంభించినట్లు ప్రకటించింది. భారతదేశం యొక్క శక్తివంతమైన మిడ్-క్యాప్ మార్కెట్ వృద్ధి సామర్థ్యాన్ని వినియోగిం చుకోవడానికి పాలసీదారులకు ఉత్తేజకరమైన అవకాశాన్ని అందిస్తున్నట్టు ఆ సంస్థ ప్రతినిధి ప్రశాంత్ శర్మ చెప్పారు. మిడ్‌క్యాప్ కంపెనీలు నిరూపితమైన వ్యాపార నమూనాను కలిగి ఉంటాయని, అధిక వృద్ధికి ప్రధానమైనవి ఈక్విటీ మార్కెట్‌ల యాజమాన్యంలో తక్కువగా ఉంటాయన్నారు.. మిడ్ క్యాప్ సూచీలు అధిక అస్థిరతను ప్రదర్శిస్తున్నప్పటికీ, లార్జ్ క్యాప్ సూచీలతో పోలిస్తే అవి దీర్ఘకాలికంగా అధిక రాబడిని అందజేస్తాయన్నారు. ఎస్‌యూడీ లైఫ్ మిడ్‌క్యాప్ మొమెంటం ఇండెక్స్ ఫండ్, దాని 6-నెలల రీబ్యాలెన్సింగ్‌తో, బలహీనమైన వాటిని క్రమపద్ధతిలో తొలగిస్తూనే అత్యుత్తమ పనితీరు కనబరుస్తున్న స్టాక్‌లను హైలైట్ చేస్తుందన్నారు. ఈ రీబ్యాలెన్సింగ్ విధానం బలమైన రాబడిపై దృష్టి పెట్టడమే కాకుండా తక్కువ అస్థిరతను ప్రదర్శించే స్టాక్‌లకు రివార్డ్‌లను కూడా అందిస్తుందని చెప్పారు. ఈ ఫండ్ నిఫ్టీ మిడ్‌క్యాప్ 150 మొమెంటం 50 ఇండెక్స్‌ను ట్రాక్ చేస్తుందని, ఇది రెండు శక్తివంతమైన పెట్టుబడి వ్యూహాలను మిళితం చేస్తుందని చెప్పారు.

ఆక్వా రంగ సమస్యలపై పరిశోధనలకు గీతం ఆసక్తి

గీతం సైన్స్ డీన్ ప్రొఫెసర్ కె.ఎస్.కృష్ణ

విశాలాంధ్ర - మధురవాడ: గడిచిన మూడు దశాబ్దాలలో దేశంలోని ఆక్వా రంగం గణనీయంగా అభివృద్ధి చెందిందని అయితే నాణ్యతా ప్రమాణాలను పాటించడంలో ఇబ్బందుల కారణంగా నేడు సవాళ్ళను ఎదుర్కొంటోందని ముఖ్యంగా మితిమీరిన యాంటీ బయాటిక్‌ల వినియోగం, వ్యర్థాల శుద్ధి, నీటి నాణ్యతలో లోపాల వల్ల సమస్యలు ఎదురవుతున్నాయని గీతం స్కూల్ ఆఫ్ సైన్స్ డీన్ ప్రొఫెసర్ కె.ఎస్.కృష్ణ పేర్కొన్నారు. గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం బయోకెమిస్ట్రీ డివిజన్ ఆధ్వర్యంలో సోమవారం తేది:06-01-2025న నిర్వహించిన వర్క్‌షాప్‌లో ఆయన పాల్గొని ప్రసంగించారు. ఆక్వా సాగు ఎంతో సున్నిత మైనదని వాతావరణ మార్పులకు, చెఱువులలో నీటి నాణ్యత, మందుల వాడకంలో జాగ్రత్తలు వహించక పోతే నష్టాలు ఎదురవుతాయన్నారు. గీతంలోని నీటి నాణ్యత ప్రయోగశాలల ద్వారా ఆక్వా పరిశ్రమ రంగానికి నాణ్యత ప్రమాణాల విషయంలో సహాయం అందించడానికి సిద్ధంగా ఉన్నామన్నారు. ఎయు -అవంతి ఆక్వా కల్చర్ స్కిల్ డవలప్‌మెంట్ సెంటర్ డైరక్టర్ డాక్టర్ ఎ.కె.రెడ్డి మాట్లాడుతూ 1970లో ప్రారంభమైన ఆక్వా రంగం నేడు 2.21లక్షల హెక్టార్లకు విస్తరించిందని తెలిపారు. రొయ్య విత్తనాన్ని వివిధ దేశాల నుంచి దిగుమతి చేసుకుని సాగు చేయడం వల్ల వివిధ సమస్యలు ఎదురయ్యాయని వివరించారు. ఆక్వా రంగంలో నాణ్యత ప్రమాణాలు పాటించడం ద్వారా విజయం సాధించవచ్చునన్నారు. ప్రభుత్వం తరుపున నమూనా హేచరీలను అభివృద్ది చేసి ఆక్వా రంగం బలోపేతానికి శ్రద్ధ తీసుకోవాలన్నారు. ఎయు -అవంతి ఆక్వా కల్చర్ స్కిల్ డవలప్‌మెంట్ సెంటర్ కోఆర్డి నేటర్ డాక్టర్ కె.ఫణి ప్రకాశ్ మాట్లాడుతూ తమ సెంటర్‌లోని 5 ప్రయోగ శాలల ద్వారా ఇప్పటి వరకు 650 మంది శిక్షణ అందించామని తెలిపారు. ఆక్వా రంగంలోని వారికి అవసరమైన శిక్షణ ఇస్తామన్నారు. అఖిలభారత ష్రింప్ అసోసియేషన్ కార్యదర్శి పి.వి.నాగేశ్వరరావు రొయ్యల సాగులో ఎదురవుతున్న ఇబ్బందులను వివరించారు. కార్యక్రమంలో గీతం జీవ శాస్త్రాల విభాగం అధిపతి ప్రొఫెసర్ ఎన్.శ్రీనివాస్, గీతం నిపుణులు ప్రొఫెసర్ అనీమా ఎస్.దధిచి, డాక్టర్ పి.షణ్ముఖానందు, డాక్టర్ పి.కిరణ్మయి పాల్గొని గీతం ప్రయోగ శాలల ద్వారా ఆక్వా రంగం పరిశోధనలకు గల అవకాశాలను వివరించారు. ఈ సందర్భంగా ఆక్వా రంగం పరిశ్రమల ప్రతినిధులు గీతంలోని మూర్తి ప్రయోగ శాలలను సందర్శించారు.